నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 శుక్రవారం 20 సెప్టెంబర్ 2024
MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## క్రీడలతో మానసికోల్లాసం

- ఎస్సార్పీ ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్



వాలీబాల్ సర్వీస్ చేసి ప్రారంభిస్తున్న జీఎం

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 19 : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో డబ్ల్యూపీఎస్‌జీఏ ఆధ్వర్యంలో సింగరేణి స్థాయి వాలీబాల్ పోటీలను జీఎం శ్రీనివాస్ ప్రారంభించారు. 11 ఏరియాల క్రీడాకారులను 6 గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, డీవైజీఎం అరవిందరావు, డబ్ల్యూపీఎస్‌జీఏ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు నరేందర్‌రెడ్డి, చాట్ల అశోక్, శ్రీనివాస్, కో ఆర్డినేటర్ సకినాల నర్సయ్య, జనరల్ క్యాప్టెన్ ఎం శ్రీనివాస్, వాలీబాల్ క్యాప్టెన్ చిన్నయ్య, ఇండోర్ క్యాప్టెన్ తోట సురేశ్ పాల్గొన్నారు.

## 35 శాతం లాభాల వాటా ప్రకటించాలి

- టీబీజీకేఎస్ డిమాండ్
- ఎస్సార్పీ జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా
- జీఎంకు వినతి



శ్రీరాంపూర్ జీఎంకు వినతి పత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 19 : సింగరేణి కార్మికులకు వెంటనే 35 శాతం లాభాల వాటా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గురువారం శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ముందు టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో కార్మికులు, నాయకులు జీఎం ఆఫీస్‌కు ర్యాలీగా వచ్చి ధర్నాకు దిగారు. ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. టీబీజీ కేఎస్ కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు లాలా, భాస్కర్, సంతోష్, మహిపాల్‌రెడ్డి, సుధాకర్, సంపత్, దుర్గం రవి, గోపాల్, శ్రీనివాస్, రాజూనాయక్, శ్రీనివాస్, సాల్మన్, తిరుపతిరెడ్డి, కార్తీక్, సదానందం, హరీశ్ పాల్గొన్నారు.



బాంబులతో పేల్చివేసిన శనిగకుంట చెరువు మత్తడి (ఫైల్)

# మత్తడి పేల్చింది హస్తం లీడర్లే!

### తమ భూముల్లోకి నీరు రావొద్దనే శనిగకుంట చెరువు మత్తడికి బాంబులు

- రానున్న రోజుల్లో కుంటను మింగేసేందుకు పక్కా స్కెచ్
- గతంలోనే బఫర్‌జోన్‌లో మొరం పోసిన కొందరు కాంగ్రెస్ లీడర్లు
- అనుమానితులను అరెస్టు చేసి, విచారిస్తున్నామంటున్న పోలీసులు
- కాంగ్రెస్ లీడర్లను కాపాడేందుకే వివరాలు వెల్లడించకుండా కాలయాపన
- కారణం ఎవరైనా కఠినంగా శిక్షించాలని బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్



పేల్చిన మత్తడిని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మంచిర్యాల, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలోని శనిగకుంటను కబ్జా చేసేందుకు హస్తం పార్టీ లీడర్లు భారీ స్కెచ్ వేశారు. అందుకే జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ చెరువును ఆక్రమించేందుకు కాంక్రీటుతో నిర్మించిన చెరువు మత్తడికి బాంబులు పెట్టి పేల్చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువుకు ఆనుకుని ఉన్న తమ భూముల్లోకి నీరు రాకుండా ఉంటే, రానున్న రోజుల్లో ఆ భూములను అమ్ముకోవచ్చని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కీలకనేత ప్లాన్ చేసి మరీ మత్తడిని పేల్చినట్లు సమాచారం. మత్తడిని పేలిస్తే చెరువులో ఉన్న నీరు తగ్గుతుందని ఇలా చేస్తే చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఓ వార్డులోని ముంపు ప్రాంతానికి కూడా నీరు రాదని స్థానిక మున్సిపల్ కౌన్సిలర్‌ను రెచ్చగొట్టి, చెరువు మీదకు ఉసిగొల్పారనే చర్చ చెన్నూర్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సదరు కాంగ్రెస్ నేతతోపాటు నియోజకవర్గ అధికార పార్టీకి చెందిన మరో ఇద్దరు కీలక నాయకులు శనిగకుంట చెరువును ఆనుకుని ఉన్న భూమిలో వెంచర్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. గతంలోనే చెరువు బఫర్‌జోన్‌లో 4 వేల ట్రిప్పుల మొరం పోసి కొంతమేర చెరువును కబ్జా చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మొరం పోసి ఆక్రమించిన స్థలం చుట్టూ వరద చేరింది. మరోసారి వర్షం పడితే అది మొత్తం మునిగిపోతుంది. అలా జరిగితే తమకు నష్టం వాటిల్లుతుందని, రానున్న రోజుల్లో ఎవరూ భూములు కొనేందుకు రారనే ఉద్దేశంతోనే ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తెలిసింది. సాధారణ రోజుల్లో మత్తడి కూలిస్తే ఇబ్బందని, వినాయక నిమజ్జనం జరిగే రోజైతే డీజే శబ్దాల్లో బాంబుల చప్పుడు కలిసి పోతుందని పక్కా ప్లాన్ చేసి మందుగుండు సామగ్రి తెచ్చి మరీ చెరువు మత్తడిని బ్లాస్ట్ చేశారని స్థానికులు చెప్తున్నారు.

#### అధికారుల పాత్రపైనా అనుమానాలు

శనిగకుంట చెరువు 39 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని శిఖం 33.22 ఎకరాలు ఉండగా ఎఫ్‌టీఎస్ 42 ఎకరాలు దీనికి బఫర్‌జోన్‌కు కలుపుకుంటే 60 ఎకరాలు అవుతుంది. ఈ భారీ చెరువు మత్తడి మూడు మీటర్ల ఎత్తులో 44 మీటర్ల పొడవుతో ఉంది. పూర్తిగా కాంక్రిట్‌తో నిర్మించిన ఈ మత్తడికి మీటర్‌కు ఒకటి చొప్పున హోల్స్ చేసి జిలిటెన్‌స్టిక్స్ అమర్చారు. వాటిని పేల్చేందుకు జనరేటర్ కూడా ఉపయోగించారు. ఇంత జరుగుతుంటే అధికారులకు ఎందుకు తెలియలేదు. జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్ల లాంటి మందుగుండు సామగ్రి మత్తడి వరకు ఎలా వచ్చింది. ఆ సమయంలో పోలీసులు ఎందుకు వారిని అడ్డుకోలేకపోయారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో అంతా తెలిసినా ఇరిగేషన్‌శాఖ అధికారులతో పాటు, పోలీసులు మిన్నకుండి పోయారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మత్తడి పేల్చివేసిన ఘటనలో అనుమానితులను అరెస్టు చేసి, విచారిస్తున్నామని చెప్తున్న పోలీసులు వివరాలు మాత్రం గోప్యంగా ఉంచుతున్నారు. అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతోనే విచారణ ఆలస్యం అవుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఎంతటి పెద్ద కేసునైనా ఒకటి, రెండు రోజుల్లో ఛేదించే పోలీసులు నాలుగు రోజులుగా విచారణ కొనసాగుస్తుండడంతో కేసు పక్కదారి పట్టే అవకాశాలున్నాయనే మత్స్యకారులు, బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా నిండిన చెరువును మత్తడిని పేల్చివేయడంతో 40 శాతం వరకు నీరు పోయి ఖాళీ అయ్యిందని, దీనికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన కాంగ్రెస్ కీలక నాయకులను కేసు నుంచి తప్పించి, స్థానిక కౌన్సిలర్‌ను ఇరికించడం కోసమే జాప్యం జరుగుతుందని ఆరోపిస్తున్నారు. సోమవారం రాత్రి మత్తడిని పేల్చేస్తే.. గురువారం వరకు జాప్యం చేయడం వెనుక అధికార పార్టీ ఎమ్మెల్యే ఒత్తిడి ఉందంటూ మండిపడుతున్నారు. గురువారం సాయంత్రం ప్రెస్‌మీట్ పెట్టి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు. దీంతో ప్రెస్‌మీట్‌లో నిజానిజాలు తెలుస్తాయని అంతా భావించారు. ఉదయం నుంచి ప్రెస్‌మీట్ ఉంటుందని చెప్పుకుంటూ వచ్చిన పోలీసులు సాయంత్రానికి అలాంటిది ఏమీ లేదని చెప్పారు. సీసీ టీవీ పుటేజీలు పరిశీలిస్తున్నామని, అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని, అన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. దీంతో కేసును తప్పుతోవ పట్టించడంలో భాగంగానే ఇదంతా జరుగుతుందనే అనుమానాలకు మరింత బలం చేకూరుతున్నది.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి నాయకుడు రాజా రమేశ్

## మత్తడిని పేల్చిన వారిని శిక్షించాలి : బీఆర్‌ఎస్

చెన్నూర్ పట్టణంలోని శనిగకుంట మత్తడిని డిటోనేటర్లు, జిలెటిన్‌స్టిక్స్‌తో పేల్చి ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకుడు రాజారమేశ్ డిమాండ్ చేశారు. ధ్వంసమైన శనిగకుంట మత్తడిని గురువారం పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం చెన్నూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఘటనపై ఏసీపీ, సీఐలు విచారణ జరిపి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. లేకపోతే సీపీ వద్దకు వెళ్తామని, అవసరమైతే మా నాయకులతోపాటు వెళ్లి ఐజీకి కూడా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. ఎమ్మెల్యే బాల్క సుమన్ హయాంలో నియోజకవర్గంలోని చెరువులను అభివృద్ధి చేసి సుందరీకరణ చేశామన్నారు. చెరువులో వెంచర్ వేసుకుని లాభపడాలనే దురుద్దేశంతోనే ఓ బడా కాంగ్రెస్ నాయకుడు శనిగకుంట మత్తడిని బాంబులతో ధ్వంసం చేశారన్న విషయం యావత్ చెన్నూర్ ప్రజలకు తెలుసన్నారు. ఎమ్మెల్యే వివేక్ ఆదేశాలతోనే రెండు రోజులుగా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఘటన జరిగినప్పుడే విచారణ ప్రారంభిస్తే కాంగ్రెస్ నాయకులు బయటపడుతారని.. ఇక్కడున్న కొంత మంది షాడో ఎమ్మెల్యేలు చెప్పింది విని ఎమ్మెల్యే వివేక్ ఆదేశాల మేరకు మూడు రోజులయ్యాక పోలీసులు హడావుడి చేస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే పేద దళితులను తీసుకొచ్చి రెండు రోజుల నుంచి పోలీస్ స్టేషన్‌లో కూర్చొబెట్టారన్నారు. అమాయకులైన దళితులను వదిలేసి, ఎవరైతే ఈ దురాఘతానికి పాల్పడ్డారో, ఎవరైతే మందుగుండు సామగ్రిని అందించారో, పేలుడు పదార్థాలు ఇచ్చి పేల్చమని చెప్పారో వారిని పట్టుకుని శిక్షించాలన్నారు. చెరువును ఆనుకుని వెంచర్ వేసేది కోటపల్లి మండలంలోని సిర్సా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గొడిసెల బాపురెడ్డి అనే విషయం అందరికీ తెలుసునన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి కుడిభుజంగా మెదులుతున్న వ్యక్తి అయినందునే ఆయన పేరు చెప్పడానికి పోలీసులు భయపడుతున్నారన్నారు. ఆయనతోపాటు మరో షాడో ఎమ్మెల్యే (వెంచర్‌లో 25 శాతం వాటా ఉన్న వ్యక్తి) పేరు చెప్పటానికి వెనకాడుతున్నారన్నారు. ప్రజా పాలన అని చెప్తున్న కాంగ్రెస్ సర్కార్ ప్రజలను మోసం చేస్తూ పేద ప్రజలకు రోడ్డుకు లాగుతుందే తప్పా ఎక్కడ ప్రజలకు న్యాయం చేయడం లేదన్నారు. ఈ దుశ్చర్యతో చెరువు కిందున్న ఆయకట్టు రైతులు, మత్స్యకారులకు నష్టం జరిగిందన్నారు. వారికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

#### సుమన్‌పై దుష్ప్రచారం చేస్తే సహించం..

కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా గత ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఈ వ్యవహారంలోకి లాగే ప్రయత్నం చేస్తున్నారని రాజారమేశ్ మండిపడ్డారు. ఐదు సంవత్సరాల బాల్క సుమన్ కాలంలో ఏ రోజు బాంబు పేలిందో ప్రజలు ఆలోచించాలన్నారు. అనవసరంగా ఫేక్‌న్యూస్ పేర్లతో వాట్సాప్‌ల్లో మెస్సేజ్‌లు పెట్టి దుష్ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. ఎంత మర్యాదగా ఉంటారో, మేము అంతే మర్యాదగా ఉంటామని, ఇలాంటి పనులు చేస్తే చర్యకు ప్రతి చర్య తప్పదని హెచ్చరించారు. పేద దళితులైతే ఎవరైతే పోలీసు స్టేషన్‌లో ఉన్నారో, వారిని ఉసిగొలిపిన వారు ఎందుకు బయట తిరుగుతున్నారని పోలీసులు సమాధానం చెప్పాలన్నారు. ఒక వేల ఎవరైనా బీఆర్‌ఎస్ పార్టీలో ఉండి ఇలాంటి పనులకు పాల్పడితే వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, తుమ్మ రమేశ్, దోమకొండ అనీల్, జగన్నాథుల శ్రీను, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు మేడ సురేశ్‌రెడ్డి, నాయిని సతీశ్, అరీఫ్, తాటికొండ సురేశ్ పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌పై నిర్బంధం

- ప్రజాభవన్ ముట్టడికి వెళ్లకుండా ముందస్తు అరెస్టులు
- పోలీస్‌స్టేషన్‌లకు నాయకుల తరలింపు
- రుణమాఫీ చేయాలని డిమాండ్



దండేపల్లిలో పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు

దండేపల్లి/జైపూర్/కోటపల్లి, సెప్టెంబర్19 : రుణమాఫీకాని రైతులు ప్రజాభవన్ ముట్టడికి పిలుపునివ్వగా, బీఆర్‌ఎస్ నేతలు తరలి వెళ్లకుండా పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధించారు. గురువారం ఉదయమే నేతలను ముందుస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. దండేపల్లి మండలంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, అక్కల రవి, నాయకులు గోళ్ల రాజమల్లు, అల్లంల సంతోష్‌లను అరెస్టు చేశారు. అలాగే జైపూర్‌లో టేకుమట్ల ఎంపీటీసీ బడుగు రవి, నాయకులు జగన్‌గౌడ్, దూట శేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కోటపల్లి మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు కొట్టె నారాయణ, శేగం లస్మయ్య, రాళ్లబండి శ్యాం, కొట్టె వెంకటేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకూ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.



జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టుఅయిన బీఆర్‌ఎస్ నాయకులు





కోటపల్లి పోలీస్‌ల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు

## బీఆర్‌ఎస్ నేత ఇంటి ముందున్న రోడ్డు తొలగింపు



సీసీ రోడ్డును తొలగిస్తున్న జేసీబీ

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 19 : బీఆర్‌ఎస్ నేత, నస్పూర్ మున్సిపల్ కౌన్సిలర్ బేర సత్యనారాయణ ఇంటి ముందున్న రోడ్డును మున్సిపల్ అధికారులు జేసీబీతో తొలగించారు. మున్సిపల్ అధికారులు రెండేళ్లక్రితం ఆయన ఇంటి ముందు రూ.2 లక్షలతో రోడ్డు వేశారు. ఈ రోడ్డు కొంత పై భాగంలో ఉండగా, వర్షపు నీరు తమ ఇళ్లలోకి వస్తుందని, ఆ రోడ్డును తొలగించాలని స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం పోలీసుబందోబస్తు మధ్య బేర సత్యనారాయణ ఇంటి ముందున్న సిమెంట్ రోడ్డును జేసీబీతో తొలగించారు. సత్యనారాయణ భార్య, కూతురు ఈ విషయంపై ప్రశ్నించినప్పటికీ అధికారులు వినిపించుకోలేదు. మున్సిపాలిటీ వేసిన రోడ్డును ధ్వంసం చేయడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమపై ఫిర్యాదు చేసిన వారి ఇండ్లు సర్వే నం. 42 లోని ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా కట్టారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు కావాలనే టార్గెట్ చేశారని ఆరోపించారు.

# ఐదంతస్తులు నేలమట్టం

- నస్పూర్ మున్సిపాలిటీలో హైడ్రా తరహాలో భవనం కూల్చివేత
- సర్వే నంబర్ 42లో ప్రభుత్వ భూమి ఆక్రమించి బిల్డింగ్ నిర్మించారంటున్న అధికారులు
- బాధిత కుటుంబాన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విధులకు ఆటంకం కలిగించారని అన్నయ్య కుటుంబ సభ్యులపై కేసు



భవనాన్ని కూల్చివేస్తున్న జేసీబీ



నేల కూలిన ఐదంతస్తుల భవనం

మంచిర్యాల, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నస్పూర్ మున్సిపాలిటీలో ఐదంతస్తుల భవనాన్ని గురువారం మున్సిపల్ అధికారులు నేలమట్టం చేశారు. కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో సర్వేనంబర్ 42లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేశారని, పలుమార్లు నోటీసులిచ్చినా పట్టించుకోలేదని, అందుకే కూల్చివేశామంటూ అధికారులు చెబుతున్నారు. గురువారం ఉదయం 6 గంటలకే జేసీబీలతో మున్సిపల్, పోలీసు అధికారులు భవనం దగ్గరికి చేరుకున్నారు. మొదట ఐదో ఫ్లోర్‌లో నివాసముంటున్న ఆ ఇంటి యాజమాని డీకొండ అన్నయ్య భార్య విజయ, కుమారుడు డీకొండ నవీన్‌ను కిందకు తీసుకొని వచ్చారు. ఎందుకు తీసుకెళ్తున్నారో చెప్పాలని అడిగినా వినకుండా జీపులో ఎక్కించుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఉదయం 5 గంటలకు వాకింగ్ వెళ్లిన అన్న య్య ఇంటికి చేరుకోగానే అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మున్సిపల్ సిబ్బంది పై ఫ్లోర్‌లో ఉన్న ఇంటి సామగ్రిని కిందకు దిం పారు. ఆపై కూల్చివేత మొదలు పెట్టారు. ఈ క్రమంలోనే అన్నయ్య ఇద్దరు కూతుళ్లు వచ్చా రు. ఇంటిని కూల్చవద్దని అధికారులతో గొడవకు దిగారు. ఇల్లు కూల్చితే ఇక్కడే చచ్చిపోతామంటూ బెదిరించడంతో పోలీసులు వారి ని అదుపులోకి తీసుకున్నారు. ఉదయం 6 గంటలకు మొదలైన కూల్చివేత ప్రక్రియ మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగింది.

#### సర్వే నంబర్ 40లో పర్మిషన్.. 42లో నిర్మాణం..!

2019లో సింగరేణి కార్మిక సంఘం నాయకుడు డీకొండ అన్నయ్య నస్పూర్ సర్వేనంబర్ 40/2లో 350 గజాల భూమిని పొనగోటి ప్రేమలత–గోపాల్‌రావు వద్ద కొనుగోలు చేశారు. ఇంటి నిర్మాణ కోసం మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. అనుమతులు రావడంతో ఆయన ఇంటి నిర్మాణాన్ని మొదలుపెట్టారు. ఈయన పర్మిషన్ తీసుకున్న సర్వే నంబర్ 40లో కాకుండా 42లో నిర్మాణం చేపట్టారని అధికారులు పేర్కొంటున్నారు. ఇది ఇల్లీగల్ అని, గతంలో అనేకసార్లు నోటీసులు ఇచ్చామని, పట్టించుకోకపోవడంతో నిర్మాణాన్ని కూల్చివేస్తున్నామని అధికారులు అంటున్నారు. మరోవైపు బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు మాత్రం ఇంటి నిర్మాణానికి అధికారులే పర్మిషన్ ఇచ్చారంటున్నారు. కట్టేటప్పుడు అడ్డుకోకుండా ఇప్పుడు కోట్లాది రూపాయల భవనాన్ని కూల్చడం ఏమిటని ఏంటని ప్రశ్నిస్తున్నారు. కూల్చివేతలకు సంబంధించిన నోటీసులు చూపించాలని అడిగినా అధికారులు స్పందించడం లేదంటూ మండిపడ్డారు. పర్మిషన్లు ఇచ్చేప్పుడు అది సర్వే నంబర్ 42నా.. లేక సర్వేనంబర్ 40లో ఉందా అనే విషయం మున్సిపల్ అధికారులకు తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. కూల్చివేత జరుగుతున్న సమయంలో అక్కడికి వచ్చిన డీకొండ అన్నయ్య కూతుళ్లు, బంధువులు ఈ విషయాన్ని మీడియాతో చెప్పుకుంటూ బోరున విలపించారు. కాగా, కూల్చివేతల సమయంలో విధులకు ఆటంకం కలిగించారంటూ మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు డీకొండ అన్నయ్య, ఆయన భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు సహా బంధువులైన మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

#### పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జనం..

ఈ భవనం మంచిర్యాల కలెక్టర్ కార్యాలయం దారిలో ఉండడం.. సమీపంలోనే జాతీయ రహదారి ఉండడంతో జనం పెద్ద ఎత్తున గుమిగూడి తిలకించారు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న మంచిర్యాల, శ్రీరాంపూర్, సీసీసీ ప్రాంత ప్రజలు ఘటనా స్థలానికి పెద్ద సంఖ్యతో తరలివచ్చారు. హైడ్రా తరహాలో కూల్చివేత పర్వం కొనసాగడంతో అందరూ ఆసక్తిగా చూశారు. దీంతో మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఇది హాట్ టాపిక్‌గా మారింది. సర్వే నంబర్ 42లో అనుమతులు లేకుండా ఇండ్లు నిర్మించుకున్న అక్రమదారుల్లో అలజడి మొదలైంది. ఇంత పెద్ద భవనాన్నే కూల్చివేశారంటే ఇంకెన్ని కూల్చివేతలు ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కనుసన్నల్లోనే కూల్చివేత జరిగిందంటూ అక్కడికి వచ్చిన జనం చర్చించుకోవడం కనిపించింది. బీఆర్‌ఎస్ నేతల ఇళ్లనే టార్గెట్‌గా చేసి కూల్చివేతలు ఉంటాయంటున్నారు. మరోవైపు జనం పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ముగ్గురు సీఐలు ఆకుల అశోక్, మోహన్, నరేశ్‌తో పాటు ఐదుగురు ఎస్‌ఐలు సుగుణాకర్, సంతోష్, రాములు, సురేష్, ప్రసన్నతో పాటు పోలీస్ బలగాలను మోహరించి బందోబస్తు నిర్వహించారు.

#### అక్రమంగా నిర్మించడంతోనే కూల్చివేత

సర్వే నంబర్ 42లోని ప్రభుత్వ భూమిలో డీకొండ అన్నయ్య అక్రమంగా ఇల్లు నిర్మించడంతోనే కూల్చివేశామని నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ తెలిపారు. డీకొండ అన్నయ్యకు సర్వే నంబర్ 40లో 350 గజాల భూమి ఉందని, దీనిపై మున్సిపాలిటీలో ఇంటి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇల్లు మాత్రం సర్వేనంబర్ 42 ప్రభుత్వ భూమిలో నిర్మించారని తెలిపారు. స్థలం ఒకచోట ఉంటే.. మరోచోట ఇల్లు కట్టడంతో నిర్ధారణ కోసం తహసీల్దార్‌కు పంపించామన్నారు. రెండు సార్లు సర్వేచేసి ప్రభుత్వ భూమిలో భవనం నిర్మించినట్లు నిర్ధారించుకున్నాకే చర్యలకు ఉపక్రమించినట్లు చెప్పారు. మున్సిపాలిటీలో ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. అక్రమంగా ఇంటినిర్మాణం చేపట్టారని 2022 నుంచి అన్నయ్యకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. సర్వే నంబర్ 42 పరిధిలో మరో 60 నిర్మాణాలకు సంబంధించి నోటీసులు ఇచ్చామని, వారి నుంచి సరైన సమాధానం రాకపోతే కచ్చితంగా కూల్చివేతలు ఉంటాయని స్పష్టం చేశారు.